

## కిడ్నీ భూతాన్ని తరిమికొట్టాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉద్దానాన్ని పట్టిపీడిస్తున్న కిడ్నీ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రభుత్వంతోపాటు, స్వచ్ఛంద సంస్థలు కలిసికట్టుగా ముందుకు రావాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. శనివారం తన ఛాంబరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్దానం ప్రజలు విధిగా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలోనే కిడ్నీ వ్యాధిని గుర్తిస్తే మరణాల రేటును నివారించొచ్చని అన్నారు. జిల్లా న్యాయ వ్యవస్థ అంతా ఉద్దానంలో విరివిగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 11న ఏర్పాటు చేసిన మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగించుకోవాలని కోరారు.

# ఆర్‌టిసికి పండగ

- కలిసొచ్చిన సంక్రాంతి సీజన్
- ప్రత్యేక బస్సుల ద్వారా రూ.72.27 లక్షల ఆదాయం
- గతేడాదితో పోలిస్తే అదనంగా రూ.24.67 లక్షల రాబడి
- రెండు పర్యాయాలు ఛార్జీల పెరుగుదలే కారణం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

చాలా కాలం తర్వాత ఆర్‌టిసి గల్లా పెట్టె కాసులతో గలగలాడింది. నష్టాల్లో కూరుకుపోతున్న ఆర్టీసీ సంక్రాంతి కలిసొచ్చింది. సాధారణ రోజుల్లో తిరిగే బస్సులతో పాటు ప్రత్యేక బస్సుల ద్వారా అదనపు ఆదాయం సమకూరింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖ ప్రాంతాలకు వేసిన ప్రత్యేక బస్సులతో ఆర్‌టిసికి భారీ ఆదాయం సమకూరింది. ఒక్క విశాఖ రూట్‌లోనే 80శాతంపైగా ఆదాయం వచ్చింది. సంవత్సరం కాలంలో రెండు పర్యాయాలు వివిధ రూపాల్లో పెరిగిన బస్సు ఛార్జీలే ఆదాయం పెరుగుదలకు కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో పాటు ఈ సంవత్సరం సాధారణ ఛార్జీలే వసూలు చేయడంతో ప్రయాణికులు ఆర్‌టిసిలో ప్రయాణానికి మొగ్గుచూపారు. ఏదిఏమైనా గతేడాదితో పోలిస్తే భారీగా ఆదాయం సమకూరడం ప్రజా రవాణ శాఖకు కొంత ఉపశమనం కలిగించినట్లయింది.

జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో సాధారణ రోజుల్లో 315 బస్సులు తిరుగుతున్నాయి. ప్రతి ఏడాదీ సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఈ ఏడాది సంక్రాంతికి ముందు ఈనెల 11 నుంచి 14 వరకు నుంచి 155 బస్సులను నడిపారు. వీటి ద్వారా ఆర్‌టిసికి రూ.33.46 లక్షల ఆదాయం సమకూరింది. సంక్రాంతి తర్వాత తిరుగు ప్రయాణాల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 16 నుంచి 19 వరకు 204 బస్సులను తిప్పారు. దీని ద్వారా రూ.38.81 లక్షల ఆదాయం వచ్చింది. మొత్తం మీద సంక్రాంతి ప్రత్యేక బస్సుల ద్వారా మొత్తం రూ.72.27 లక్షల ఆదాయం లభించింది. గతేడాది సంక్రాంతి పండగ నేపథ్యంలో తిప్పిన స్పెషల్ బస్సుల ద్వారా మొత్తం రూ.47.59 లక్షల ఆదాయం వచ్చింది. ఇందులో సంక్రాంతి ముందు 250 బస్సులు నడపగా రూ.32.34 లక్షల ఆదాయం లభించింది. పండగ తర్వాత 93 బస్సులను తిప్పగా 15.75 లక్షల ఆదాయం సమకూరింది. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం అదనంగా రూ.24.68 లక్షల ఆదాయం వచ్చింది

**ఆదాయం పెరిగినా.. తగ్గిన బస్సులు**

గత సంవత్సరంతో పోలిస్తే సంక్రాంతికి ముందు పెద్దగా ఆదాయంలో మార్పు కనిపించడం లేదు. గత సంవత్సరం రూ.47.59 లక్షల ఆదాయం సమకూరగా ప్రస్తుతం రూ.72.27లక్షల ఆదాయం వచ్చింది. ఈ సంవత్సరం కేవలం అదనంగా రూ.1.46 లక్షల వచ్చింది. సంక్రాంతి తర్వాత మాత్రం గణనీయంగా ఆదాయం వచ్చింది. గత సంవత్సరంతో ఈ సీజన్‌లో అదనంగా రూ.23.56 లక్షల ఆదాయం సమకూరింది. అయితే గతేడాది కంటే ఈ సంవత్సరం 95 బస్సులు తగ్గించడం వెనుక ఆర్‌టిసి అధికారులు ఏ గణాంకాలను లెక్కలోకి తీసుకున్నారో అర్థం కావడం లేదు. సంక్రాంతి తర్వాత మాత్రం గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం అదనంగా 111 బస్సులను తిప్పారు. ఆదాయం కూడా గణనీయంగానే వచ్చింది. పండగ ముందు గతేడాది మాదిరిగనే బస్సులను తిప్పితే మరింత ఆదాయం వచ్చి ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది

**అధికశాతం బస్సులు విశాఖకు**

సంక్రాంతి స్పెషల్ బస్సుల్లో అధికశాతం బస్సులు విశాఖ మార్గంలో నడిపారు. హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు 20 బస్సుల వరకు తిప్పారు. జిల్లాలోని నాలుగు డిపోల్లో శ్రీకాకుళం రెండో డిపో అధిక ఆపరేషన్ రేషియో(ఒఆర్) సాధించినట్లు తెలుస్తోంది. ఈ నెల 18, 19 తేదీల్లో మిగిలిన డిపోలు 94 నుంచి 96 శాతం ఒఆర్ సాధించగా రెండో డిపో వంద శాతం పైగా ఒఆర్ వచ్చినట్లు ఆర్‌టిసి అధికారులు చెప్తున్నారు

**ఛార్జీల పెరుగదలతో పెరిగిన ఆదాయం**

గతేడాది సంక్రాంతితో పోలిస్తే ప్రస్తుతం ఆదాయం పెరగడానికి బస్సు ఛార్జీల్లో వ్యత్యాసమే కారణమని తెలుస్తోంది. గతేడాది జూన్ 30న పల్లె వెలుగు మొదలు అన్ని కేటగిరీల బస్సు ఛార్జీలనూ భారీగా పెంచింది. దీంతో పాటు డీజిల్ సెస్ రూపంలో పల్లె వెలుగు బస్సుకు రూ.2లు పెంచింది. ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో రూ.5లు, ఎసి బస్సుల్లో రూ.10 భారం మోపింది. పెంచిన టిక్కెట్ ధరలు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి. ఏప్రిల్‌లో సెస్ రూపంలో పల్లె వెలుగు ప్రయాణికుల టికెట్‌పై రూ.2లు, ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులపై రూ.5 పెంచింది. ఛార్జీల పెంపుతో ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌లో ఆర్‌టిసి ఆదాయం గణనీయంగా పెరిగింది.

# నేడు పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష

- పరీక్షకు 23,735 మంది హాజరు
- జిల్లావ్యాప్తంగా 72 కేంద్రాలు ఏర్పాటు
- ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు పరీక్ష
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నేడు ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నారు. రాత పరీక్షకు సంబంధించి ఇప్పటికే పోలీసు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎస్‌పి జిఆర్ రాధిక అధికారులతో పలు మార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించి పరీక్ష నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. పరీక్ష ఆదివారం ఉదయం 10గంటలకు ప్రారంభమై ఒంటి వరకు సాగనుంది. పరీక్ష నిర్వహణకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు

రాత పరీక్ష కోసం మొత్తం 72 కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం రీజియన్ పరిధిలోని శ్రీకాకుళం టౌన్, రూరల్, ఎచ్చెర్ల, పొందూరు, టెక్కలి రీజియన్ పరిధిలోని టెక్కలి ఐతమ్ కళాశాల, నరసన్నపేట, కాశీబుగ్గ, కోటబొమ్మాళి ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు 23,735 వేల మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. వీరిలో పురుషులు 18151 కాగా, మహిళలు 5584 మంది ఉన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటలకు తావులేకుండా పటిష్టమైన పోలీస్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. కేంద్రాల చుట్టు పక్కల ప్రాంతాల్లో జెరాక్స్ షాపులు మూసివేసేలా ఆదేశాలు జారీ చేశారు ప్రతి సెంటర్ వద్ద పటిష్టమైన పోలీసు సిబ్బందితో పాటు అదనంగా రక్షక్ మొబైల్స్, రూట్ బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్, డోర్ కమ్ మెటల్ డిటెక్టర్ ఏర్పాటు చేశారు.

**అభ్యర్థులకు పలు సూచనలు**

పరీక్షకు హాజరు కానున్న అభ్యర్థులకు అధికారులు పలు సూచనలు చేశారు. ఉదయం 9గంటల నుంచి సెంటర్లకు అభ్యర్థులను అనుమతించనున్నారు. ఉదయం 10గంటలకు ఒక నిమిషం దాటినా అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరని అభ్యర్థులకు సూచించారు. పరీక్ష కేంద్రానికి వచ్చే అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక ఒరిజినల్ ఐడెంటిటీ కార్డు తమ వెంట తీసుకురావాలని సూచించారు. బ్లాకు లేదా బ్లూ పాయింట్ పెన్, వాటిని మాత్రమే అనుమతించనున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్స్, స్మార్ట్ వాచ్, క్యాలిక్‌లేటర్, ఇతర విలువైన వస్తువులు తీసుకురావొద్దని సూచించారు.

# మోడీ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- రైతు సంఘాల సమన్వయ కమిటీ డిమాండ్
- 26న ట్రాక్టర్లు, బైక్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు తాండ్ర ప్రకాష్, కోనారి మోహన్‌రావు డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఈ నెల 26న చేపట్టనున్న రైతుల ట్రాక్టర్, బైక్ ర్యాలీ పోస్టర్‌ను శనివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50శాతం కలిపి అన్ని పంటలకూ మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధరలకు చట్టబద్ధత లేక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు రుణమాఫీ చేస్తున్న మోడీ ప్రభుత్వం రైతుల పంట రుణాలు ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపు ఆపాలన్నారు. సమగ్ర పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో అమరులైన రైతు కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ట్రాక్టర్లు, బైక్‌ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, ఎఐటియుసి నాయకులు చిక్కాల గోవిందరావు, పి.చంద్రరావు, కె.కృష్ణారావు, పి.ప్రభావతి, శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘాల నాయకులు

## విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- ఎపి ఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి తెచ్చిన ప్రమాదకర విద్యుత్ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యాన శ్రీకాకుళం ఎపి ఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24 లోటుగా చూపబడిన రూ.13వేల కోట్ల నిధులు ప్రభుత్వమే సబ్సిడీగా ఇవ్వాలని, నివాసాలకు వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఆధారిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం సరికాదన్నారు. ట్రూ అప్ ఛార్జీల విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి నెలా విద్యుత్ ఛార్జీలను సవరించాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి, తదితరులకు ఇస్తున్న విద్యుత్ రాయితీలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1.89 కోట్లు, జిల్లాలో 9.25 లక్షల విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి రంగం సిద్ధం మైందని అన్నారు. ఇది కార్పొరేట్ కంపెనీలకు వరాల జల్లు.. ప్రజలపై బారాలు వేసేదిగా ఉందని వారు అన్నారు. వ్యవసాయ విద్యుత్ పేరుతో ఆదాని కంపెనీలతో 30ఏళ్ల పాటు ఏడు వేల మెగావాట్ల విద్యుత్ ఒప్పందాన్ని గుట్టుచప్పుడు కాకుండా కుదుర్చుకుందని విమర్శించారు. హిందుజా కంపెనీకి నియంత్రణ మండలి యూనిట్‌కు రూ.3.82 పైసలు చెల్లించాలని నిర్ణయించిందని, ఆ రేట్లు చాలవన్నట్టు అదనంగా రూ.1200 కోట్లు చెల్లించాలని కంపెనీ పైరవీలు ప్రారంభించిందని విమర్శించారు. ధర్నా అనంతరం విద్యుత్‌శాఖ ఎస్‌ఇ దైవప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు కె.మోహన్‌రావు, కె.నాగమణి, టి.తిరుపతిరావు, ఎ.సత్యనారాయణ, కొత్తకోట అప్పారావు, సూరయ్య, శ్రీ దేవి పాణిగ్రహి, ఎం.గోపి, ఎన్‌వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎపి ఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

**టెక్కలిలో నిరసన**

**టెక్కలి రూరల్:** విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ టెక్కలి సిపిఎం కార్యాలయం వద్ద శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, నాయకులు లక్ష్మణరావు, కొల్లి యల్లయ్య, సుబ్రహ్మణ్యం, ధర్మారావు, సురేష్, ధర్మా, రమేష్, అనిల్, సంతోష్, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్‌శాఖ సిబ్బందికి వినతిపత్రం అందజేత**

**కొత్తూరు:** విద్యుత్ సంస్కరణల కోసం కేంద్రం తెచ్చిన బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌శాఖ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఆయనతోపాటు నాయకులు రామారావు, రాము, లక్ష్మణ్, సంజీవు, రామకృష్ణలు ఉన్నారు.

టెక్కలి: నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

కొత్తూరు: విద్యుత్‌శాఖ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న ప్రసాద్

# ఎవరికీ సేదతీర్చని ఫ్యాన్ గాలి

వీక్షణం

కష్టాలు, నష్టాలతో సతమతమవుతున్న ప్రజలకు వచ్చే ఫ్యాన్‌గాలి సేద తీర్చుతుందని భావించిన వారికి సంక్షేమం ఉపసమనం తప్ప మరేమీ కనిపించలేదు. ముఖ్యంగా తాము అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని భావించిన అధికార పార్టీ నేతలకు, కార్యకర్తలకు మూడున్నరేళ్ల కాలంలో కనీస ఉపసమనం లభించలేదన్న బాధ, ఆవేదన ఎక్కువగా కనిపిస్తోంది. జిల్లాలో ఎవరిని కదిపినా మా బాధను పత్రికల్లో రాయొద్దని మనసులోని మాటను బయటపెడుతున్నారు. పార్టీ పదవులు, ప్రభుత్వంలోని పదవులు పొందిన వారు గ్రామ స్థాయి నుంచి శాసనసభ, శాసనమండలి సభ్యుల వరకు ఉన్న అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఎవరూ సంతోషంగా లేరని, తమ పదవులు నిరుపయోగంగా తయారయ్యాయని లోలోన మధనపడుతుండటం చూస్తున్నాం. జిల్లాలో పార్టీ అధ్యక్షులు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్‌ను నియమించి ఆరు నెలలవుతోంది. ఇంతవరకు జిల్లా కార్యవర్గాన్ని నియమించలేదు. కార్యవర్గంలో పదవుల కోసం ఎదురుచూస్తున్న వారికి తీవ్ర నిరాశ, నిస్పృహలు లోనౌతున్నట్లు తెలిసింది. జిల్లా కార్యవర్గం జాబితాను అధినేతకు పంపామని చెప్తున్నారు తప్ప, దాన్ని ఖరారు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. మండల కమిటీలు సరేసరి. అనుబంధ సంఘాల కమిటీ ఊసే లేనేలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే జిల్లాలో పార్టీ డొల్లగా తయారైందని సీనియర్ నేతలే ఆ నోటా, ఈ నోటా తమ అనుయాయుల ద్వారా బయట చెప్పిస్తున్నారు. ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా పార్టీ నేతలకు, కార్యకర్తలకు పని ఉంటుంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రులకు కూడా పని లేకుండా ప్రేక్షకులుగా నిలుస్తున్నారన్న అభిప్రాయం సీనియర్ నేతల్లో ఉంది. అదే సమయంలో కార్యకర్తలకు, నేతలకు మధ్యలో ఉన్న, ఉండాల్సిన సత్సంబంధాలు పూర్తిగా లేకుండా పోయిన పరిస్థితిని జిల్లాలో చూస్తున్నాం. జిల్లాలోని వాలంటీర్లు, సచివాలయాలు పార్టీ కేంద్రాలుగా తీర్చిదిద్దే పని సాగుతున్నట్లు జిల్లాలో జరుగుతున్న పరిణామాలు చెప్తున్నాయి. వాలంటీర్లకు జతగా గృహ సారథులను, సచివాలయాలకు జతగా సమన్వయకర్తలను నియమించడంతో గతంలో జన్మభూమి కమిటీల మాదిరిగా రూపాంతరం చెందినట్లు కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ఎలాంటి రాజకీయాలను నడిపారో ఇప్పుడు వాలంటీర్ల సారథ్యంలో అలాంటి రాజకీయాలు నడిపించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లో వాలంటీర్లు, సమన్వయకర్తల పని కీలకమని జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక సమావేశాల్లో ప్రసంగాలు చేయడం చూస్తున్నాం. జిల్లాలో 11 మంది నేతలకు, కార్యకర్తలకు, బిసి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, పదుల సంఖ్యలో డైరెక్టర్లను కట్టబెట్టారు. ఆ పదవులు పొందిన వారికి వేతనాల రూపంలో ప్రజాధనం రెండేళ్లపాటు లక్షలాది రూపాయలను కట్టబెట్టారు తప్ప, ఆ కార్పొరేషన్ల ద్వారా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లభించలేదు. పదువులు పొందిన వారి కాలపరిమితి రెండు నెలల క్రితం ముగిసిపోయింది. బిసిల పదవుల పందేరం పూర్తిగా అటకెక్కించి, తాజాగా వారిని కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చినా, కార్పొరేషన్ల ప్రయోజనం ఏమీ ఉండదన్నది అనుభవం చెబుతోంది. వైసిపి పాలనలో నినాదమే తప్ప, నిర్వహణ ఉండదని, కార్పొరేషన్లు ఏర్పాటు అద్దం పడుతోంది. ఇలాంటివన్నీ జిల్లాలోని పార్టీ నేతలను, కార్యకర్తలను తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురి చేస్తున్నాయని, జిల్లాలో అసలు పార్టీ ఉందా? అన్న సంసయం కలుగుతుందన్న భావనలో పలువురు సీనియర్లు ఉన్నట్లు తెలిసింది. జిల్లాలో వివిధ స్థాయిల్లో ఉన్న ప్రజాప్రతినిధులు ఎవరూ సంతోషంగా లేరని మండల పరిషత్ సమావేశాల్లోనూ, జిల్లా పరిషత్ సమావేశాల్లోనూ వెల్లడవుతోంది. సమావేశాల్లో మంత్రుల మాటలు తప్ప కాసులు కనిపించడం లేదు. రాజ్యాంగ బద్ధంగా జిల్లాలోని సుమారు వేయి పంచాయతీలకు కేంద్రం నుంచి చేరాల్సిన నిధులను ప్రభుత్వం దోచుకోవడంతో 80శాతంగా ఉన్న అధికార పార్టీ సర్పంచ్‌లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అందువల్ల జిల్లాలోని అన్ని స్థాయిల్లో ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, ఆ పార్టీ అభిమానుల్లో సంతోషం పోయి తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నట్లు వారి మాటలు, చేతలను బట్టి వెల్లడవుతోంది. పార్టీలో నిండుకున్న డొల్లతనం వల్ల ప్రజల బాధలను, కష్టాలను పట్టించుకునే నేతలు కరువైనట్లు జరుగుతున్న పరిణామాలు చెప్తుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వంలో సంక్షేమం మాటలు తప్ప, అభివృద్ధి బాట ముళ్ళ కంచెలతో నిండిపోయినట్లు కనిపిస్తోంది.

జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకే దిక్కులేని పరిస్థితిలో మేము ఇచ్చిన హామీలకు విలువ ఎక్కడ ఉంటుందని జిల్లాలో మంత్రులే చెప్పే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో ప్రజలపై వరుసగా వేస్తున్న భారాలు గురించి గడప గడప కార్యక్రమంలో నేతలను ప్రశ్నిస్తున్నా సూటిగా సమాధానం చెప్పలేక తడబడటం, మాట తప్పించి, మాట్లాడటం చూస్తున్నాం. ఇన్ని వైఫల్యాల నేపథ్యంలోనే తాజాగా జిల్లాలో ప్రశాంత్ కిశోర్ సర్వే బృందం మరో సారి సర్వే జరుపుతున్నట్లు స్పష్టమైన సమాచారం ఉంది. ముఖ్యమంత్రి ఇస్తున్న 'వైనాట్' నినాదానికి జిల్లాలో ప్రతికూల వాతావరణం నెలకొందని బృందం గుర్తించినట్లు తెలిసింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఖాతాల్లోని డబ్బును ప్రభుత్వం దోచేసి, ప్రతి నెలా సక్రమంగా జీతాలివ్వలేని కారణంగా శ్రీకాకుళం నగరంతో పాటు ప్రధాన పట్టణాల్లో పది శాతం ఓట్లు తగ్గుదల ప్రభావం కనిపిస్తోందని ఆ సర్వే బృందాలు గుర్తించినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఉద్యోగ, ఉపాధ్యాయులను ఎన్నికల ముందైనా సానుకూలంగా మలుచుకుంటే తప్ప, ప్రతికూల ప్రభావం స్పష్టంగా ఉంటుందని జిల్లాలోని మంత్రులే తమ అనుయాయుల వద్ద చెప్తున్నట్లు తెలిసింది. జిల్లాలో అధికార పార్టీకి ప్రతికూల వాతావరణం పెరుగుతున్నా గ్రూపుల గోలను ఎదుర్కోవడం లేదు. గ్రూపుల గోల ఏ స్థాయిలో ఉంటుందో మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్‌ను ప్రేమతో ఓడిస్తామని సారవకోట మండలం నేతలు చెప్తున్నట్లు ప్రచారంలోకి వచ్చింది. రాజకీయాల్లో నిప్పు లేకుండా పొగలు చిమ్ముతాయన్న మాటలను విశ్వసించలేని పరిస్థితితో ఈ ప్రచారం ఉంది. మరో ఐదు నియోజకవర్గాల్లో ఇలాంటి గ్రూపుల గోల ఉంది. కొత్త అభ్యర్థులు తెరపైకి వస్తున్నారు. పికె బృందం సర్వేలోకి ఎక్కుతున్నారు. కొన్ని స్థానాల్లోనైనా అభ్యర్థులు మార్చే వాతావరణం జిల్లాలో కనిపిస్తోంది.

అధికార పార్టీ పాలనతో ప్రతికూల గాలి వీస్తున్నా ఆ గాలిని తమవైపు సానుకూలంగా మలుచుకునే వాతావరణం జిల్లా టిడిపిలో కనిపించడం లేదు. మూడు నియోజకవర్గాల్లో తిరుగుబాటు అభ్యర్థులు బరిలో నిలిచే వాతావరణం ఇప్పటికే కనిపిస్తోంది. వైసిపిపై ఉన్న వ్యతిరేకత తమకు పట్టం కడుతుందని టిడిపి అధినేత నుంచి జిల్లా నాయకుల వరకు ఉన్న ఆశలు నెరవేర్చుకునేలా రాజకీయ నినాదాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో విఫలమయ్యే పరిస్థితిని చూస్తున్నాం. టిడిపిపై తిరిగి విశ్వాసం పొందేలా విధానాలు, నినాదాలు తీసుకోవడంలో వైఫల్యం స్పష్టంగా ఉంది. చంద్రబాబు చెప్పే అభివృద్ధి మాటలను జిల్లా ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదు. రాష్ట్ర విభజన తరువాత తొలి అసెంబ్లీలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క దాన్నైనా ఐదేళ్లలో కనీసం శంకుస్థాపన చేసిన దిక్కులేదు. ప్రజలు ప్రత్యామ్నాయం గురించి ఆలోచిస్తున్నారు. ఎదురుచూస్తున్నారు.

-సత్తారు భాస్కరరావు

**ధాన్యం కొనుగోలు తీరుపై రైతుల ఆందోళన**

(6లో)

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE - O.S. 33/2022**

Between:
**Vonna Srinivasa Rao** ...Plaintiff
And:
**Balaga Seetha Ram & Others** ...Defendants

To,
**D11) B.S.Mamathakasturibai** w/o late Someswara Rao, Hindu, aged 52 years, working as doctor, R/o Door No. 2-321, Kovela Veedhi, Narasannapeta village and mandal, Srikakulam district.
**D12) Ponnana Prabhaas,** s/o late Someswara Rao, Hindu, aged 24 years, R/o door No. 2-321,Kovela Kovela Veedhi, Narasannapeta village and mandal, Srikakulam district.
**D13) Ponnana Monalisa,** D/o late Someswara Rao, Hindu, aged 20 years, R/o doorNo. 2-321, Kovela Veedhi, Narasannapeta village and mandal, Srikakulam district.

Please take notice that the above suit in **O.S. 33/2022** this matter stands posted on **24-01-2023** for your appearance before the court, therefore you are hereby directed to appear the Honourable Court on **24-01-2023 at 10-30 AM** either in person or through an advocate failing which the matter will be decided in your absence.

**// By Order //**
**Baratam Nageswararao**
Advocate,
Srikakulam.
**Cell: 9391380645**

**IN THE HONOURABLE COURT OF THE ADDL JUNIOR CIVIL JUDGE JUDICIAL MEGISTRATE(JMFC) AT SRIKAKULAM IA 248/2022 O.S. No. 462/2022**

Between:
**Chintada Kesava Rao** ...Plaintiff
And:
**Gadili Hemasundar** ...Defendant

To,
**Gadili Hemasundar,** S/o Bhaskara Rao, aged 35 years, Hindu, Cultivation, residing at Amballavalasa village, Gara mandal, near Buravelli,Gara mandal, Srikakulam district.

Please take notice that the above suit in **IA 248/2022 O.S. No. 462/2022** this matter stands posted on **31-01-2023** for your appearance before the court, therefore you are hereby directed to appear the Honourable Court on **31-01-2023 at 10-30 AM** either in person or through an advocate failing which the matter will be decided in your absence.

**// By Order //**
**L. Lakshmi Narasamma**
**G. Malleswararao**
Advocates,
Srikakulam.
**Cell: 7799083675, 9948845204**

**GENERAL NOTICE**

Under the instructions of my client **Kolla Rajesh,** s/o late Paparao, resident of Zinkibhadra village & P.O., Sompeta Mandal, Srikakulam District, I issue this **GENERAL NOTICE.**

That my client is having a joint family house which is morefully described in the schedule given below in Zinkibhadra village and my client's family members without the consent and knowledge of my client are making preparations to sell the said house. In fact, my client has got right. Title in the said house.

So, if any body wants to purchase that house without my client's consent and knowledge, it will be in-valid and unenforceable in law.

Please take notice that the General Public are hereby informed not to purchase the said house without the knowledge and consent of my client, if any-body still want to do so, my client is going to take appropriate legal action against such person.

**Schedule:** Tiled cum terraced house bearing Door No.1-102 situated on the Southern row of Pedda Devara Veedhi, Zinkibhadra village & P.O., Sompeta Mandal, Srikakulam District bearing Survey No.328/1 and the same is bounded by:
**East:** House of Kolla Kurma Rao,
**South:** Backyards of the houses of Jalari Street,
**West:** House of Kolla Dilleswara Rao,
**North:** Road.

**K.S. PRASAD BABU,**
ADVOCATE, SOMPETA,
SRIKAKULAM.

Sompeta,
Date: 20-01-2023.

రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

## ధాన్యం కొనుగోలు తీరుపై రైతుల ఆందోళన

### సబ్ కలెక్టరేట్ వద్ద ట్రాక్టర్లతో నిరసన

**టెక్కలి:** ప్రభుత్వం ధాన్యం కొనుగోలు తీరుపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పోలవరం, లింగాలవలస గ్రామానికి చెందిన రైతులు శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ట్రాక్టర్లతో ధాన్యం తెచ్చి నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి రైతుల వద్దకు చేరుకొని వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు బగాది వినాయకరావు, బోడ్డేపల్లి వెంకటరావుల మాట్లాడుతూ రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయకుండా తిప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల నుంచి రైతులు ధాన్యం అన్‌లోడ్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని, దీంతో ట్రాక్టర్లు అద్దెలు చెల్లించుకోలేని పరిస్థితిలో ఉన్నామని రైతులు సబ్ కలెక్టర్ వద్ద వాపోయారు. ఈ విషయమై అధికారులను అడిగితే తాము ఏమీ చేయలేమని, ఉన్నతస్థాయి అధికారుల వద్దకు వెళ్లి చెప్పుకోవాలని సూచిస్తున్నారని రైతులు వాపోయారు. దీనిపై సబ్ కలెక్టర్ స్పందిస్తూ... స్థానికంగా ఉన్న మిల్లుల వద్ద ఖాళీ లేకపోవడంతో కోటబొమ్మాళిలోని మిల్లుకు తీసుకెళ్లి లోడింగ్ చేయించుకోవాలని సూచించారు. దీంతో రైతులు ఆందోళనను విరమించి ధాన్యం లోడులను తరలించారు.

దీక్ష చేస్తున్న '108' ఉద్యోగులు

## ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

108 ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని పాదయాత్ర సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని సిఐటియు నాయకులు ఆర్.సురేష్‌బాబు, టి.తిరుపతిరావులు డిమాండ్ చేశారు. 108 ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద శనివారం రిలే నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నియామకాల్లో సంబంధిత అర్హత కలిగిన 108 ఉద్యోగులకు వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరవిందో సంస్థ 108 బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అన్నారు. ఇపిఎఫ్, ఇఎస్ఐ కోసం ప్రతినెలా యాజమాన్యం వాటా చెల్లించడం లేదన్నారు. ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించేందుకు 8 గంటల పనివిధానం అమలు చేయాలన్నారు. ఇఎంటిలకు రూ.30 వేలు, పైలట్‌కు రూ.28 వేలు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 108 ఉద్యోగుల సంఘం నాయకులు విజయమోహన్, సంఘం ప్రతినిధులు సత్యం, రాజశేఖర్, గణపతి, నాగభూషణరావు, తవిటిబాబు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా అడ్మిషన్లు

### బాలల హక్కుల కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మోడల్ స్కూళ్లు, కెజిబివి పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని బాలల హక్కుల రాష్ట్ర కమిషన్ సభ్యులు జి.సీతారాం అన్నారు. నగరంలోని సమగ్ర శిక్షా అభియాన్ కార్యాలయంలో మోడల్ స్కూళ్లు, కెజిబివి పాఠశాలల ప్రిన్సిపాళ్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కెజిబివి, మోడల్ స్కూళ్లలో అడ్మిషన్లు ఇస్తే అర్హులైన వారు నష్టపోతారని అన్నారు. అందువల్ల విద్యాశాఖ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ఇటీవల అక్రమంగా సీట్లు భర్తీ చేస్తున్నట్టు వస్తున్న ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టాలని డిఇఒకు సూచించారు. విచారణ అనంతరం నివేదికను ప్రభుత్వానికి పంపించాలన్నారు. సమావేశంలో డిఇఒ

మాట్లాడుతున్న సీతారాం

గార పగడాలమ్మ, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి, సభ్యులు వి.రమణమూర్తి, ఎం.గన్నెప్పడు, జిసిడిఒ బి.శోభ, బాలల సంరక్షణ జిల్లా అధికారి రమణమూర్తి, సిఆర్‌పిఎఫ్ జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మొదలవలస వాసుదేవకుమార్, పి.శేఖర్, డాక్టర్ జగ్గారావు, సింగూరు ప్రవీణ్ కుమార్, మోహిని, బి.ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని ప్రయివేటు, కార్పొరేటు పాఠశాలల యాజమాన్యాలు బాలల హక్కుల ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తప్పవని సీతారాం అన్నారు. జెడ్‌పి మీటింగ్ హాల్‌లో ప్రయివేటు, కార్పొరేటు పాఠశాలల యాజమాన్యాలు, ఎంఇఒలతో సమీక్షించారు.

**రథసప్తమి వేడుకుల్లో బాలలకు ప్రత్యేక సౌకర్యాలు**

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 28న నిర్వహిస్తున్న రథసప్తమి వేడుకుల్లో బాలింతలకు, చిన్నారులకు ప్రత్యేకంగా ప్రవేశం కల్పించడంతో పాటు క్యూలైన్లలో పాలు ఇతర సౌకర్యాలు కల్పించాలని జి.సీతారాం సూచించారు. అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆయనకు శేషవస్త్రాన్ని కప్పి మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఇఒ వి.హరిసూర్యప్రకాష్‌తో సమావేశమయ్యారు. పిల్లలకు పాలిచ్చేందుకు వీలుగా క్యూలైన్లలో ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనురాధ, డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్.డి.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

# 'ఉపాధి' చూపకుంటే చర్యలు

### డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కూలీందరికీ ఉపాధి పనిని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు మేరకు చూపించినట్లయితే చర్యలు తప్పవని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు సిబ్బందికి హెచ్చరించారు. 30 మండలాలకు చెందిన ఎపిఒలు, ఇసిలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని దినాల కల్పనపై రాష్ట్ర అధికారులు రోజూ సమీక్షిస్తారని అన్నారు. ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్య ధోరణిని పడినాడి విధి నిర్వహణపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోనూ 200 మంది కూలీలకు ఉపాధిని కల్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. గత

మాట్లాడుతున్న చిట్టిరాజు

నవంబరు నుంచి పదేపదే సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నా పనుల ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో కూలీలు ఎక్కువగా ఉన్నా పనిప్రదేశాల వద్ద వారి హాజరు ఎందుకు ఉండడం లేదని ప్రశ్నించారు. వంద రోజుల పని దినాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు పూటలా కూలీలు పనులు చేస్తున్న ఏకైక జిల్లా శ్రీకాకుళం అని, కానీ సగటు కూలి తక్కువగా ఉండడం సిబ్బంది విధి నిర్వహణలో అసత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. సగటు కూలి రూ.250కి తగ్గితే సహించేది లేదని హెచ్చరించారు. జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సమన్వయ అధికారి అప్పలనాయుడు, ఎపిడి హరిత, డిబిటి మేనేజర్ విజయవాణి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ జి.రామచంద్రరావు పాల్గొన్నారు.

**నైరలో పనుల పరిశీలన**

ఇంతకు ముందు శ్రీకాకుళం రూరల్ మండలం నైరా పంచాయతీలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ ఇది పేదల పథకమని, జాబ్ కార్డుదారులు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమయపాలన పాటిస్తూ గరిష్ట కూలి పొందే విధంగా పనులు చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని, తద్వారా చేపట్టిన పనులు గ్రామానికి, రైతాంగానికి ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఈయనతో పాటు ఎపిఒ సీతారాం, జెఇ బాలముకుందబాబు, టెక్నికల్ అసిస్టెంట్ రత్నాకర్, రవి తదితరులు ఉన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

### శాసనసభ స్పీకర్ సీతారాం

**బూర్జ:** రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలుతో పాటు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్‌రెడ్డి సంకల్పమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని ఉప్పాడవెంకంపేటలో రూ.17.50 లక్షల అంచనాలతో నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ భవన సముదాయాన్ని, లచ్చయ్యపేటలో నాడు-నేడు రెండవ దశ కార్యక్రమంలో భాగంగా రూ.25 లక్షల అంచనాలతో భవనాల ఆధునికీకరణ సుందరీకరణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య రంగాన్ని గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. వైద్య సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. అనంతరం లచ్చయ్యపేట మండల పరిషత్ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్వయంగా భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిరపు రామారావు, అవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు

'మధ్యాహ్న భోజనం' చేస్తున్న స్పీకర్ సీతారాం

గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు ఉదయ్ కుమార్, స్థానిక సర్పంచ్ అమ్మాజమ్మ, అధికారులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

## గడ్డెమ్మ పోరాటాలు స్ఫూర్తి

**కొత్తూరు :** మండలంలోని గొట్టిపల్లికి చెందిన గిరిజన సంఘం నాయకులు, సిపిఎం పూర్వ సభ్యులు నిమ్మక గడ్డెమ్మ (60) ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, నాయకులు కె.మోహనరావు, పోలాకి ప్రసాద్, సిర్ల ప్రసాద్ గొట్టిపల్లి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేశారన్నారు. రోడ్లు, గొట్టిపల్లి సంత ఏర్పాటుకు పోరాటంలో గడ్డెమ్మ ప్రముఖ పాత్ర పోషించారని కొనియాడారు. సిపిఎం నిర్వహించే పోరాటాల్లో ఆమె చురుకుగా పాల్గొనేవారని పేర్కొన్నారు. ఆమె మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. ఆయనతో సిపిఎం నాయకులు, స్థానిక నాయకులు ఉన్నారు.

ఫిర్యాదు కాపీని చూపిస్తున్న దళిత సంఘాల నాయకులు

## అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి- పోలాకి

మూత్ర విసర్జనకు వెళ్లిన మహిళపై లైంగిక దాడికి పాల్పడి, మహిళకు సంబంధించిన గడ్డికుప్పను కాల్చివేసి, కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ నరసింహమూర్తి శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ఈ సంఘటన జరిగినట్లు బాధితురాలు పోలీసులకు పిర్యాదు చేసిందన్నారు. ఈ ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు. మండలంలోని బెలమర బిసి కాలనీలో ఎస్‌సి తరగతికి చెందిన లక్ష్మి తన ఇద్దరు కుమారులతో జీవిస్తుందన్నారు. అదే గ్రామానికి చెందిన గొర్లె సత్యం కొన్ని రోజులుగా లైంగిక వాంఛతీర్చమని వేధిస్తుండేవాడని అన్నారు. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో గడ్డికుప్ప పక్క మూత్ర విసర్జన చేస్తున్న సమయంలో లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించారని అన్నారు. బాధిత మహిళలు కేకలు వేయడంతో పారిపోయాడని తెలిపారు. కొంత సమయం తర్వాత మరలా వచ్చి కులం పేరుతో దూషించి, గడ్డి కుప్పకు నిప్పు పెట్టి, చంపుతామని బెదిరించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకే ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, డిహెచ్‌పి ఎస్.శ్రీనివాసరావు, చిట్ట సింహాచలం బాధితురాలకు అండగా నిలిచారు.

రోగులను పరీక్షిస్తున్న 104 సిబ్బంది

## వైద్య సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు

గ్రామీణులకు సకాలంలో వైద్యసేవలను అందజేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు పి.శివశంకర్, ఆధిమణికంఠలు అన్నారు. మండలంలోని రాపాకలో హెల్త్‌వెల్‌నెస్ కేంద్రంలో 104 వాహనం ద్వారా శనివారం వైద్య సేవలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో మంచంపట్టిన రోగులకు, గర్భిణులకు, బాలింతలకు ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామని అన్నారు. అలాగే సుగర్, బిపి వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి లావణ్య, జ్యోత్స్న, ఎఎన్ఎంలు ఉదయలక్ష్మి, వనజాక్షి, హెల్త్ అసిస్టెంట్ రమణ, శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు లక్ష్మి, రాజేశ్వరి, ఉషారాణి, పుణ్యావతి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మురళీకృష్ణ

## జల్‌జీవన్ మిషన్‌పై అవగాహన

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా జల్‌జీవన్ మిషన్ కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ విద్యార్థులకు జల సంరక్షణ కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. నీటి వృథాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. అలాగే పాఠశాలలో నీటి గాఢత, పిహెచ్ స్థాయిలను విద్యార్థుల సమక్షంలో పరిశీలించారు. రోజుకు ఐదు లీటర్ల నీరు తాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో బృంద సభ్యులు డి.వాసుదేవరావు, ఐఇసి బి.ఆదినారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉదయ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం జానకిరామయ్య, ఉపాధ్యాయులు భాస్కరరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ధ్యేయం

**రణస్థలం:** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని యర్రవరం సచివాలయం పరిధిలోని పెద్దయామలపేట, చిల్లపేట యర్రవరం గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. అనంతరం పెద్దయామలపేటలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి రూ.22 వేలు ఆర్థికసాయం అందజేశారు.

# 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు నిషేధం

### నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు

మాట్లాడుతున్న కమిషనర్ ఓబులేసు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ నిబంధనలకు లోబడి నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లు ఈ నెల 26 నుంచి నిషేధిస్తున్నట్టు నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆయన ఛాంబరులో నిషేధం అమలులో భాగస్వాములు కావాల్సిన వివిధ శాఖల సిబ్బందితో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లు తయారు చేసే వ్యాపారస్తులతో గతంలో పలుమార్లు సమావేశాలు నిర్వహించినా ప్రభుత్వం గడువు నివ్వడంతో విరామం ఇచ్చామని అన్నారు. ఇప్పుడు 26 నుంచి అమలు తప్పని సరికావడంతో వ్యాపారులు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లు వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నోడల్ ఆఫీసర్‌తో పాటు సిటీ లెవెల్ టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉపయోగిస్తే వారిపై జరిమానా విధిస్తామని తెలిపారు. సమావేశంలో నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ జి.వెంకటరావు, శానిటరీ సూపర్‌వైజర్ బి.గణేష్‌కుమార్, ఫ్లెక్సీ యజమానులు పాల్గొన్నారు.

బూర్జ : పరామర్శిస్తున్న రవికుమార్

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

### టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. మండలంలోని గుత్తావెల్లి, దొంకలపర్త, నీలంపేట గ్రామాల్లో మృతి చెందిన కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఇంతవరకు నామమాత్రం ధాన్యం కొనుగోలు చేసి గొప్పలు చెప్పుకుంటుందని ఆరోపించారు. చివరు గింజ వరకూ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలో చేస్తుందే తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. రైతులు ధాన్యం కొనుగోలుకు మద్దతు ధర లేక, కొనుగోలు జరక్క ఏటా నష్టపోతునే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 11 మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పండితే... ఇప్పటి వరకు నాలుగు వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. రైతుల ఖాతాలో పడిన డబ్బులను తిరిగి వెనక్కి తీసుకుంటున్న దళారీలు వ్యవస్థ ఇప్పటికీ కనిపిస్తుండడం ఆందోళనకరమన్నారు. వాలంటీరు వ్యవస్థ ఒక బూటకమని వాఖ్యానించారు. జిల్లాలోని రైతాంగం పండించిన చివరి ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని, లేకుంటే రైతుల పక్షాన కలెక్టరేట్ వద్ద ధర్నాకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈయనతో పాటు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎ.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

**పొందూరు:** ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండలంలోని మలకాం, తండ్యాం, బురిడికంచరాంతో పాటు పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన టిడిపి నాయకుల, కార్యకర్తల కుటుంబాలను శనివారం పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేస్తామని శాసనసబ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన ప్రసాదరావులు అంటున్నారని, క్షేత్రస్థాయిలో కొనుగోలు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఈయనతో పాటు టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, మలకాం సర్పంచ్ జాడ శ్రీనివాసరావు ఉన్నారు.

# ముగిసిన అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలు

**శ్రీకాకుళం అర్బన్ :** క్రీడా రంగానికి అత్యంత ప్రాముఖ్యత ఉందని, మానసిన, శారీరక ఉల్లాసాన్ని పొందడంతో పాటు ఉద్యోగాల్లో అనేక అవకాశాలు దక్కించుకోవచ్చని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన 66 అంతర జిల్లా ఎస్‌జిఎఫ్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల ముగింపులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో జిల్లాకు అత్యంత ప్రాచుర్యముందని గుర్తుచేశారు. మల్లయుద్ధంలో కోడి రామ్మూర్తినాయుడు ప్రపంచ ప్రాచుర్యం పొందారన్నారు. అలాగే వెయిట్ లిఫ్టింగ్‌లో కరణం మల్లేశ్వరి జిల్లా ఖ్యాతిని అంతర్జాతీయ

ట్రోఫీని అందజేస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

స్థాయిలో నిలపారన్నారు. ఎంతో మంది క్రీడాకరులు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై జిల్లా ఖ్యాతిని నిలిపారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్ అషోషియేషన్ సభ్యులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎం.రేణుక అన్నారు. మండలంలోని కలివరం పంచాయతీ ముద్దాడపేట జగనన్న హౌసింగ్ లేఅవుట్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. అనతరం మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఇప్పటికైనా సందిగ్ధత వీడి నిర్మాణాలకు ముందుకురావాలని సూచించారు. నిర్మాణాలకు ముందుకొచ్చిన వారికి ఎప్పటికప్పుడు ప్రభుత్వం ద్వారా బిల్లుల చెల్లింపు జరిగేలా చూస్తామని చెప్పారు. సత్వరమే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపిఎం పైడి కూర్మారావు, హౌసింగ్ ఎఇ రమేష్, సచివాలయ సిబ్బంది

ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ రేణుక

పాల్గొన్నారు.

**కంచిలి :** ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి దేవదాసు రెడ్డి కోరారు. మండలంలోని మండపల్లి లేఅవుట్ వద్ద శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులతో సమీక్షించారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు మాదిన రజని, జగబంధు దొలాయి పాల్గొన్నారు.

## నారాయణపురం నీరు విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఏటా రబీ సాగు సమయంలో నీరందక అవస్థలు పడుతున్న శ్రీకాకుళం, గార మండలాల రైతాంగానికి ఈ ఏడాది నాగావళి నదిలో నారాయణపురం కాలువ ద్వారా నీరందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు నీటిపారుదల శాఖ అధికారులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుని నీరు విడుదల చేశారు. నారాయణపురం ఎడమ కాలువ ద్వారా నీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. శివారు ప్రాంతాల వరకు ఈఏడాది సాగునీరు అందించేందుకు నిల్వలు ఉన్నాయని, రైతులు సమగ్ర సస్యరక్షణ ద్వారా పొదుపుగా నీటిని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## కాఫీ మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

గిరిజన మండలమైన మెళియాపుట్టిలో పలుకొండ ప్రాంతాల్లో చల్లని వాతావరణం ఉంటుందని, ఈ ప్రాంతాల్లో కాఫీ మొక్కలు పెంచిలే ఐటిడిఎ దృష్టి సారించాలని గిరిజన సంఘం ప్రతినిధులు, వైస్ ఎంపిపి సవర ఆది నాయుడు, బాణాపురం సర్పంచ్ పెద్దింటి చందరరావు కోరారు. ఇప్పటికే గిరిజనులు పైనాపిల్, పసుపు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు.

ఇటువంటి ప్రాంతాల్లో ఐటిడిఎ ప్రయోగాత్మకంగా కాఫీ మొక్కలను పెంచేందుకు సహకరిస్తే గిరిజనులకు మరింత ఆదాయం చేకూరుతుందన్నారు. అరకు ప్రాంతంలో సాగయ్యే కాఫీ మొక్కలను గొట్టిపల్లి, చందనగిరి, గూడ, హడ్డివాడ, భరణికోట, రాయికోలా, ముత్యాలబొంతు, మరబొంతు ప్రాంతాల్లో వాతావరణం అనుకూలంగా ఉంటుందని తెలిపారు.

## బ్యాంకు ఉద్యోగుల ధర్నా

**శ్రీకాకుళం అర్బన్:** బ్యాంకు ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూనియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ వైస్ ప్రెసిడెంట్ జి.కరుణ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ నెల 30, 31 తేదీల్లో భాగంగా స్థానిక సింహద్వారం వద్ద ఉన్న యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీస్ వద్ద శనివారం ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారానికి ఐదు రోజులు బ్యాంకింగ్ పని దినాలుగా ప్రకటించాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షన్ సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. మెరుగైన కస్టమర్ సేవ చేయడానికి అన్ని కేడర్లలో తగిన సిబ్బందిని నియమించాలన్నారు. కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. కో-ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు గిరిధర్ నాయక్, ఎపి యూనియన్ బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి కె.తేజేశ్వరరావు, వెంకటరమణ,రాము, వాసుదేవరావు, రాజు పాల్గొన్నారు.

## ప్రకాష్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- కవిటి

ఆంధ్రాబ్యాంకు మాజీ డైరెక్టర్, ఎమ్మెల్యే అశోక్ తండ్రి బెందాళం ప్రకాష్ జయంతి వేడుకలను పార్టీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ప్రకాష్ ఘాట్ వద్ద నివాళ్లర్పించారు. టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి ప్రకాష్ చేసిన సేవలు గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన వెంకటరమణ, మనిచంద్ర



నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రకాష్, బెందాలం రమేష్, బాసుదేవ్ ప్రధాన్, బాసుదేవ్ రౌలో, బెందాలం విజయ్, బల్లెడ రవి, బల్లెడ్ రమేష్, బార్ల చినబాబు, బదకల ప్రసాద్, బండారు మిన్నారావు, కొరికాన కుర్మారావు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరాలకు స్పందన

**ఇచ్ఛాపురం:** జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపుమేరకు ఉద్దానం ప్రాంతంలో రక్తం అందక ఎవరూ మృతి చెందకూడదన్న పిలుపు మేరకు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు అన్నారు. మండలంలోని ధరంపురంలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు 51 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో మత్స్య విభాగ రాష్ట్ర కార్యదర్శి నాగుల హరిబెహరా పాల్గొన్నారు.

**సోంపేట :** స్థానిక రోటరీ క్లబ్ హాల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ జి.పాల్‌కిరణ్, అను న్యూరో అండ్ కార్డియాక్ సైన్సెస్ బృందం రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. 250 మంది రోగులను పరీక్షించారు. ముందుగా ఎంపిపి డాక్టర్

ఇచ్ఛాపురం : పరిశీలిస్తున్న జనసేన నాయకులు

నిమ్మ దాసు ప్రారంభించారు. రోటరీ అధ్యక్షుడు ఎం.యుగంధర్, సభ్యులు బి.శ్రీకాంత్, కె.రవి, ఎం.వెంకటరమణ, టి.వెంకటరమణ, వి.శివశంకర్, డి.శ్రీను, జగన్మోహనరావు, నగరి శరత్, కె.తిరుమలరావు, పి.మధు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్‌ను అందజేస్తున్న మంత్రి ధర్మాన

# చదువు మార్పునకు మూలం

## రెవెన్యూ మంత్రి ధర్మాన

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

చదువే మార్పునకు మూలమని, సమాజ వికాసానికి ప్రగతికి దోహదకారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని బాపూజీ కళా మందిర్‌లో కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు ఆధ్వర్యాన నగ పంచాయతీ పరిధిలోని హైస్కూళ్లలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం జగన్ విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. సమాజంలో ఉండే వ్యత్యాసాలను, అసమానతలను తొలగించి చైతన్యవంతమైన సమాజం నెలకొల్పేందుకు ప్రభుత్వం మార్పు కోరుకుంటోందన్నారు. ఆర్థిక స్థోమత కలిగిన వారు ప్రజాసేవకు తోడ్పాటు అందించాలన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు అందించిన తోడ్పాటు వారికి ఎంతో మేలుచేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, వైసిపి నాయకులు సాధు వైకుంఠరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, కోణార్కు శ్రీను, గురుగుబెల్లి లోకనాథం, అంధవరపు ప్రసాద్, మండవిల్లి రవి పాల్గొన్నారు.

సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

# నేటి తరానికి సతీష్ స్ఫూర్తి

**ప్రజాశక్తి- నరసన్నపేట**

మండలంలోని జమ్ము పంచాయతీ తెలుగు యువత సభ్యులు రెడ్డి సతీష్ కుమార్ నేటి తరానికి స్ఫూర్తి అని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సతీష్‌కుమార్ జిల్లాలో తొలిసారిగా వ్యవసాయ డ్రోన్ పైలెట్‌గా ప్రయోగం చేపట్టి ప్రభుత్వం నుంచి ప్రశంసలు, ధ్రువపత్రాలను పొందారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం సతీష్‌కుమార్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సతీష్ కుమార్ ఉన్నత చదువులు చదువునా వ్యవసాయంపై ఉన్న మక్కువగా గ్రామంలో నూతన ఆధునికత పరికరాలను ఉపయోగిస్తూ... వ్యవసాయ రంగంలో ముందుకెళ్తున్నారని అన్నారు. రానున్న కాలంలో మరిన్ని విజయాలు వ్యవసాయ రంగంలో పొందాలని ఆశిస్తూ... శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర సెక్రటరీ కిల్లి వేణుగోపాల్‌స్వామి, పార్లమెంట్ పార్టీ తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు, బలగ ప్రహర్ష, గొద్దు సాయికుమార్ పాల్గొన్నారు.

# ఆడపిల్లలను సంరక్షించాలి

**ప్రజాశక్తి- పలాస**

ప్రపంచంలో ఆడపిల్లల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుందని, ఆడ పిల్లలను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపిడిఒ ఎస్.రమేష్‌నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఐసిడిసి ఆధ్వర్యాన భేటి బచావో, భేటి పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం అంగన్వాడీ కార్యకర్తలు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లి గర్భంలోనే ఆడపిల్ల అని తెలియగానే ఆదిలోనే తుంచేస్తున్నారని, అటువంటి పరిస్థితి చేపట్టడం వల్లే సమాజంలో తల్లి, చెల్లి, అక్కలను దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమాజానికి ఆడపిల్ల అత్యవసమన్నారు. కార్యక్రమంలో కాశీబుగ్గ ఐసిడిఎస్ పిఒ డి.శార్వాణి, అదనపు ఐసిడిఎస్ పిఒ పాపినాయుడు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు యు. లత, సుప్రియ, బి.సంతోషి, ఆర్.జియమ్మ, ఆర్.ధనలక్ష్మి, డి.సునీత, సిహెచ్.దానమ్మ, కోకిల అరుణ పాల్గొన్నారు.

**పొందూరు:** పొందూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కింతలి సెక్టార్ సూపర్‌వైజర్ జి.వి.రత్నం ఆధ్వర్యాన కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 11 నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన కిశోర బాలికలకు రక్తహీనత, మంచి, చెడు అలవాట్లు, వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవడం వంటి పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుడుమూరు గోవిందరావు, హెచ్‌వి తిమూతి, సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు చంద్రావతి, సంతోషిణి, రమణమ్మ, ఉష, కృష్ణవేణి, జయలక్ష్మి, చిన్నమ్మడు, కళావతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు

**ఇచ్ఛాపురం :** మండలంలోని మందపల్లి సచివాలయ పరిధిలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. బాలికల సంరక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని ఐసిటిఎస్ సిడిపిఒ నాగమణి తెలిపారు. కార్యక్రమంలో గౌతమి, బి.నరసమ్మ, జి.జ్యోతి, కె.జ్యోతి, కె.సునీత, శారద, ఎం.జ్యోతి పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ వికాసంతో విద్యార్థులకు మేలు

## సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

వ్యక్తిత్వ వికాసంతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని సెట్‌శ్రీ మేనేజర్ వి.వి.అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్, సెట్‌శ్రీ, స్పోర్ట్స్ ఆధ్వర్యాన వ్యక్తిత్వ వికాసం, విద్యా, ఉద్యోగం, క్రీడలపై విద్యార్థులకు జాతీయ సేవా పథకం అధికారి జలుమూరు రవిబాబు ఆధ్వర్యాన శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువజన సర్వీసులశాఖ ద్వారా ప్రభుత్వం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌లో అవగాహన కల్పిస్తుందన్నారు. ఉన్నత విద్య, భవిష్యత్ లక్ష్యాలను సాధించేందుకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునేందుకు అంతర్గత వ్యక్తిత్వ వికాసానికి

మాట్లాడుతున్న అప్పలనాయుడు

కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు. ఇంటర్వ్యూలను ఎదుర్కోవడానికి, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకునేందుకు విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా విద్యా ఉద్యోగ దీపికను విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామసుందర రావు, స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్ కె.వి.రమణ, అసిస్టెంట్ మేనేజర్ కె.గీత, ఫీల్డ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

# 11న లోక్ అదాలత్

**ప్రజాశక్తి- పలాస**

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ పి.రవిశంకర్ సూచించారు. పలాస జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులతో, పోలీసులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కని వేదికని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పరిష్కరించేందుకు అవకాశం ఉన్న సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాండ్ర మురళీమోహన్, కార్యదర్శి పిండి వెంకటరావు, న్యాయవాదులు పి.లక్ష్మీనారాయణ, పి.రాజరత్నం, జిఎంజి అనిల్‌రాజ్, కామేశ్వరరావు పట్నాయక్, కోత రజనీకుమార్, ఎజిపి దేవరాజ్, చిట్టిబాబు, ప్రభాకర్, శ్యాం, రవికుమార్, బి.లక్ష్మి, కోర్టు సూపరింటెండెంట్ పి.పాణిగ్రహి, వజ్రపుకొత్తూరు ఎస్ఐ మధుసూదన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి రవిశంకర్

తనిఖీలు నిర్వహిస్తున్న ఇఒ హరికృష్ణ

# దుకాణాల తనిఖీ

**సోంపేట:** పంచాయతీలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం ఉన్న నేపథ్యంలో ఇఒ హరికృష్ణ శనివారం పలు దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్న యజమానులపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుం వసూలు చేశారు. అనంతరం స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ సంచులను తగలబెట్టారు. ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్ సంచులను ఉపయోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రాపాక కూడలిలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

# కమ్మేసిన పొగమంచు

మండలంలోని శనివారం ఉదయం దట్టంగా పొగమంచు కమ్మేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు 8 గంటలు వరకూ పొగమంచు దట్టంగా కురవడంతో రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడ్డారు. ప్రయాణాలు సాగించిన పలువురు ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ఎక్కడ ప్రమాదాలు సంభవిస్తాయోనన్న భయంతో లైట్లు వేసుకుంటూ రాకపోకలు సాగించారు. అంతేకాకుండా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్న భయంతో బయటకు రాకుండా పలువురు ఇళ్లకే పరిమితమయ్యారు.

**- ప్రజాశక్తి, పొందూరు**

అవగాహన కల్పిస్తున్న రాజేష్

# సైబర్ మోసాలపై అప్రమత్తం

**ప్రజాశక్తి- బుర్జ**

సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ యు.రాజేష్ అన్నారు. మండలంలోని కాళపర్తిలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకుసౌజన్యంతో ఎస్-ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యత శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలానా బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్లు చేస్తే మీ బ్యాంకు అకౌంట్ వివరాలు అడిగితే సమాచారాన్ని ఇవ్వవద్దని సూచించారు. డబ్బు ఆశ చూపుతూ వచ్చే ఈ మెయిల్స్, ఎస్ఎంఎస్ కాల్స్ వల్ల మోసపోవద్దని అన్నారు. బ్యాంకు అకౌంట్ నంబరు, మరే ఇతర సమాచారాన్ని ఎవరికీ ఈమెయిల్, ఫోన్ ద్వారా వెల్లడించవద్దని సూచించారు. ఎటువంటి మోసపూరిత ఆఫర్ల విషయాలలోను మోసపోవద్దని తెలిపారు. అలాగే ఎటిఎంల్లో అపరిచితులకు డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని ఎటిఎం కార్డును ఇవ్వరాదని సూచించారు.

# కేన్సర్‌పై అవగాహన అవసరం

**బూర్జ :** కేన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బుర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని పావని అన్నారు. ఆరోగ్య కేంద్రం ఆవరణలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి శరీరంలోని ఏ భాగంలోనైనా రావచ్చునన్నారు. ముఖ్యంగా మహిళలకు రొమ్ము కేన్సర్ వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ రామారావు

# కోరం లేక ఎన్నిక వాయిదా

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

మండలంలోని బొబ్బిలిపేట, పీరుసాహెబ్‌పేట గ్రామాల్లో గతంలో నిలిచిపోయిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికపై నోటీసులు ఇచ్చామని, కోరం సరిపోకవడంతో వాయిదా వేశామని ఎంఇఒ దుప్పల రామారావు శనివారం తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు హాజరు కాకపోవడం వల్లనే ఎన్నికలు ఆయా గ్రామాల్లో నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. పాఠశాలల అభివృద్ధి కోసం కమిటీ లేనందున ఏ విధమైన నిధులు కానీ, నాడు-నేడు పనులు కానీ మంజూరు కావని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యా సంక్షేమ అధికారి పైడి కూర్మారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెట్ట సన్యాసిబట్లు, నూక అప్పలనాయుడు, ఎంఆర్‌సి సిబ్బంది బొడ్డేపల్లి రఘు, రమణ, నర్సింగరావు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి అప్పలకొండయ్య

# 70 మందికి నేత్ర వైద్య పరీక్షలు

**జి.సిగడాం :** మండలంలోని ఆనందపురం అగ్రహారంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో సర్పంచ్ మోహన్ ఆధ్వర్యాన శనివారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు డాక్టర్ అప్పలకొండయ్య 70 రోగులకు నేత్రాలను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కంటి సమస్యతో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యం కోసం జెమ్స్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపి రాము, సిఆర్ఒ రాజు, మన్మథరావు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### సకాలంలో రెన్యువల్ చేసుకుంటే రాయితీ

**రణస్థలం :** రైతులు సొసైటీ రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకుంటే రాయితీ వర్తిస్తుందని సొసైటీ సెక్రటరీ గిరి బుచ్చి రంగనాథం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పైడిభీమవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులు పంట రుణాలకు ఏడాదిలోపు, రూ.లక్ష లోపు రుణ బకాయిలు ఫిబ్రవరి 20లోగా రుణాలను చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

### జెసిఎస్ మండల కన్వీనర్ల నియామకం

**నరసన్నపేట :** నరసన్నపేట నియోజకవర్గానికి వైసిపి నలుగురు జెసిఎస్ మండల కన్వీనర్లను నియమించింది. కన్వీనర్లుగా ఎంపికైన వారిలో పార్టీ సీనియర్ నాయకులు సురంగి నర్సింగరావు (నరసన్నపేట), నక్క తులసీదాస్ (సారవకోట), ధర్మాన జగన్ (జలుమూరు), కణితి సత్తిబాబు (పోలాకి) ఉన్నారు. వీరు తమకు బాధ్యత అప్పగించిన మండలాల్లోని సచివాలయాల గృహ సారథులతో కలిసి క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ పార్టీకి అనుసంధానంగా పనిచేస్తారు.

### బిసి కార్పొరేషన్ల పదవీకాలం పెంపుపై హర్షం

**నరసన్నపేట:** బిసి కార్పొరేషన్ల పదవీ కాలం పెంపుపై శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ చీపురు రాణీకృష్ణమూర్తి హర్షం తెలిపారు. ఈ మేరకు స్థానిక వైసిపి కార్యాలయం వద్ద శనివారం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సిఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు హైమావతి అప్పన్న, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పంగ కృష్ణవేణి బావాజీ నాయుడు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పొట్నూరు సాయిప్రసాద్, శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లుకలాపు రంజిత్ కుమార్‌లు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల చేయూత

**కంచిలి:** మండలంలోని మండపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కళ్యాణ్ మోహన్ అనారోగ్యంతో బాధపడుతుండడంతో పూర్వ విద్యార్థులు చేయూత అందించారు. కళ్యాణ్ మోహన్ అనారోగ్యంతో బాధపడుతూ ఒడిశా భువనేశ్వర్‌లో చికిత్స పొందుతున్నాడు. అతడి స్వగ్రామం అంతరసింగి. నిరుపేద కుటుంబం కావడంతో అతడు వైద్యానికి ఇబ్బంది పడుతున్న సంగతి తెలుసుకొని పూర్వ విద్యార్థులు సహాయం చేశారు. 2001కు చెందిన లోహిదాసు, పురుషోత్తం, అశ్విన్లు విరాళాలు సేకరించి రూ.ఆరు వేలును కళ్యాణ్ మోహన్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

### సామాజిక తనిఖీలకు సహకరించాలి

**ఇచ్ఛాపురం :** మండలంలోని 2021-22 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన గ్రామీణ ఉపాధి హామీ కింద నిర్వహించి అభివృద్ధి పనులకు క్షేత్రస్థాయిలో సిబ్బందికి సహకరించాలని ఎంపిడిఒ రామారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమీక్షించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో రూ.17.15 కోట్లతో 479 పనులు చేపట్టామన్నారు. ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది, డిఆర్‌పిలు సామజిక తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. సమావేశంలో ఎపిఒ శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి కె.మోహనరావు, ఎస్ఆర్‌పి సింహాద్రి పాల్గొన్నారు.

### అసమానతలపై పోరాడేది పాత్రికేయులు

**ఇచ్ఛాపురం:** అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని సమాజంలోని అసమానతలపై పోరాడేది పాత్రికేయులని అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి, పిఎసిఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర యాదవ్, మత్స్యకార నాయకుడు, కవిటి పిఎసిఎస్ డైరెక్టర్ కాయ భీమసేన్ అన్నారు. మండలంలోని టి.బరంపురంలో త్యాగరాజు స్వామి 176వ ఆరాధన మహోత్సవాలను శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయ అక్షరం దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ కరగాన లక్ష్మీనారాయణకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. సమాజానికి పాత్రికేయులు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు, కళాకారులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ :నియామక పత్రం అందజేస్తున్న వాణి

# కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలి

**టెక్కలి రూరల్ :** గ్రామ సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని తలగాం, పాతనౌపడ, రావివలస, టెక్కలి-4, తొలుసూరుపల్లి సచివాలయాల కన్వీనర్లు, గృహసారధిల బాధ్యతలపై శనివారం సమావేశం నిర్వహించారు. జెసిఎస్ కన్వీనర్ శిగిలిపల్లి మోహనరావు ఆధ్వర్యాన ఎంపిపి ఆట్ల సరోజినమ్మ, వైస్ ఎంపిపిలు పేరాడ రమేష్, మన్నేల కిషోర్ ఆధ్వర్యాన సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాతనౌపడ సర్పంచ్ దల్లి లోకేష్‌రెడ్డి, పెద్దరోకళ్లపల్లి సర్పంచ్ మురళీరెడ్డి, రావివలస సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, తలగాం సర్పంచ్ ప్రతినిధి హనుమంతు వెంకటేశ్వరరావు, తేలినీలాపురం సర్పంచ్ ప్రతినిధి పోలాకి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

**కొత్తూరు :** గ్రామ, సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేయాలని వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, ఎంపిటిసి ప్రతినిధి గోగుల వరప్రసాదరావునాయుడు, పిఎసిఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ ప్రతినిధి పి.లక్ష్మణరావు అన్నారు. స్థానిక మార్కెట్ వీధిలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు సేపేన అశోకుమార్, వై.ధర్మారావు, నాస బాలకృష్ణ, దారపు శ్రీరామ్‌కృష్ణ, ఎంపిటిసి లక్ష్మీనారాయణ, ఆనందరావు పాల్గొన్నారు.

# మొక్కజొన్నపై కషాయం పిచికారీ

కషాయాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవి ఆధ్వర్యాన మొక్కజొన్న పంటలపై కషాయం పిచికారీ చేశారు. రైతులు పండించిన పంటలపై తెగుళ్లు, పురుగులు నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సహజ వనరులతో తయారు చేసిన కషాయాలను పిచికారీ చేయాలన్నారు. దీంతో పంటలకు అయ్యే పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుంటూ ఆదాయాన్ని పెంచుకునే దిశగా రైతులు ముందుకెళ్లాలన్నారు. మొక్కజొన్న పంటపై వచ్చే కత్తెర పురుగు, ఇతర తెగుళ్ల నివారణకు అగ్నిస్త్ర ఖాసాయాన్ని తయారు చేసి పిచికారీ చేయాలని సూచించారు. కషాయాలు ఉండగా... రసాయనాలు దండుగ అనే ప్రకృతి వ్యవసాయ నినాదంతో రైతులు పంటలను పండించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సురేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.

సన్మానిస్తున్న అప్పలనాయుడు

### పాదయాత్రకు 'కలిశెట్టి' సంఘీభావం

**రణస్థలం:** అమరావతి రాజధాని మద్దతుగా అమరావతి నుంచి అరసవల్లి వరకు జెఎసి చైర్మన్ గద్దె తిరుపతిరావు పాదయాత్ర చేపడుతున్నారు. ఈ మేరకు ఎచ్చెర్లకు చేరుకోవడంతో టిడిపి నాయకులు, ఉత్తరాంధ్ర టిడిపి శిక్షణా తరగతుల మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు శనివారం సంఘీభావం తెలిపారు. ముందుగా తిరుపతిరావుకు దుశ్శాలువ కప్పి కొద్దిసేపు పాదయాత్ర చేపట్టారు.

# సచివాలయాల సందర్శన

**ప్రజాశక్తి- నౌపడ**

సంతబొమ్మాళి మండలం నౌపడ 1,2, వడ్డితాండ్ర సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఎంపిడిఒ ఉమాసుందరి శనివారం పరిశీలించారు. అలాగే సిబ్బంది పనితీరు, రికార్డులు, హాజరు పరిశీలించారు. అనంతరం కూర్మనాథపురం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నౌపడ సచివాలయంలో వాలంటీర్లు 50 శాతం మాత్రమే హాజరయ్యారని పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, ఉమాపతిలను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వడ్డితండ్ర పంచాయతీ కార్యదర్శి తులసి, ఇతర సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉమాసుందరి

### టెక్కలి కార్యదర్శిగా వినోద్‌కుమార్

వినోద్‌కుమార్

**టెక్కలి రూరల్ :** టెక్కలి మేజర్ పంచాయతీ కార్యదర్శిగా కూన వినోద్ కుమార్ నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. టెక్కలిలో పనిచేస్తున్న బొడ్డపల్లి రామారావు దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో బోరుభద్రలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వినోద్ కుమార్‌ను టెక్కలి పంచాయతీ కార్యదర్శిగా డిప్యూటేషన్‌పై వేశారు. వినోద్ సోమవారం విధులకు హాజరవుతారని తెలుస్తోంది.